

# లోయ

బి. అజయ్‌ప్రసాద్

'నిన్నగా వెళ్లిన మనిషి ఇంతవరకు అయిపులేడు,' శీనుకు నిన్నటి నుంచీ ఇదే ఆలోచన. రాత్రంతా నిద్రపట్టక అతడి మనసులో ఎన్నో ప్రశ్నలు. చీకట్లో మిణుగురుల్లా ముసురుతూనే ఉన్నాయి.

ఆచారి సంవత్సరాల తరబడి అక్కడి చెట్లతోనూ, రాళ్లతోనూ అనుబంధం పెనవేసుకుపోయిన మనిషి. అక్కడ తప్ప ఎక్కడికెళ్లినా ఉండలేక తిరిగొచ్చే మనిషి.

'అసమంటిది ఎవరో ఏదో అన్నారని, ఆడ మనిషితో రంకుతనం అంటగట్టారని- నిన్న మద్యాన మనగా వెళ్లిపోయాడు. వెళ్లే ముందు ఎవరికీ చెప్పను కూడా చెప్పలేదు.'

ఆచారి వెళ్లిన దగ్గర నుంచీ శీనుకు ఒకటే ఆలోచన. తలనిండా సమాధానం దొరకని ప్రశ్నలు. ఆచారి కనిపిస్తే ఏవేవో అడగాలనుంది శీనుకు. ఉదయాన్నే లేచి కొండపైకి వెళ్లి గొర్రెలకాపరులను, గుడికి వెళ్లే దారిలో తెలిసిన బైరాగులందరినీ అడిగాడు. ఎవరినడిగినా తెలియదనే సమాధానం. లోయలో ఆచారితో కలిసి తిరిగిన ప్రదేశాలన్నీ వెతికి చూశాడు. అడివంతా గాలించాడు. ఆచారి లేని ప్రదేశాలు బోసిగా, ఒంటరిగా కనిపించాయి. వెతికి వెతికి కాళ్లీడ్చుకుంటూ చివరికి జయమ్మ గుడిసె కేసి నడిచాడు.

లోయ మధ్య ఏపుగా పెరిగిన మామిడిమాను ఆకు పచ్చ గొడుగులా ఉంది. చెట్టు కింద జయమ్మ రెల్లుగడ్డి గుడిసె చెట్టులో కలిసిపోయినట్టుగా ఉంది. గుడిసె ముందు చిన్న టీ కొట్టు.

శీను వెళ్లేసరికి ఒంటిమీద పూనకం వచ్చినట్లు చెన్నమ్మను తిడుతోంది జయమ్మ.

''...మొగోనికేం ఎరుక ఆడదాని అగచాట్లు. నమ్ముకున్నందుకు నగుబాటు నీకే. పోయినోడు చెప్పన్నా చెప్పాడా? ఆయన దారి ఆయన చూసుకున్నాడు. నీకు దారి లేకపాయె. అందుకే దేనికైనా రీతీ రివాజు ఉండాలంటారు...'' ఆమె అరుపులు వెలువడేకొద్దీ కొట్లో కూర్చున్నవాళ్ల మౌనం ఎక్కువవుతూ ఉంది. చెట్టుకొమ్మల మధ్య నుంచి కీచురాళ్ల రొద నిరంతరంగా ఒకటే గుయ్యిమంటూ ఉంది. కొత్తపల్లి నుండి వచ్చిన మణెమ్మ మినపప్పు వడబోస్తూ ఒక చెవి అటు పారేసి జయమ్మ శాపనార్థాలు కుశాలుగా వింటోంది. చెన్నమ్మ అక్కడ నించి వెళ్లిపోవడం ఆమెకు సంతోషంగా ఉంది- ఆమె స్థానంలో తనకి పని దొరికిందని కావచ్చు.

కొట్లో ఎక్కడపని అక్కడే ఉండిపోయింది. బల్ల ముందు కూర్చుని టీ తాగుతున్న యాత్రికులు చెట్టు కొమ్మల మీద కోతుల గుంపుని వింతగా చూస్తున్నారు. శీను ఒకటి రెండు ఎంగిలి ప్లేట్లు, గ్లాసులు కడగడానికి ఒక పక్కనేసి, పొయ్యి మీద కెటిల్ నుంచి కొంచెం టీని గ్లాసులో పోసుకుని తాగబోతుంటే ఎదురుగా చెన్నమ్మ కన్పించింది. నిన్న పొద్దుట్నుంచీ ఆమె ఇంత ఎంగిలి పడలేదని గుర్తొచ్చి మనసుకు బాధ కలిగి టీ గ్లాసు ఒక పక్కన పెట్టాడు.

చెన్నమ్మ నిశ్శబ్దంగా పందిరి గుంజనానుకుని నిలబడి ఉంది. ముప్ఫై ఐదేళ్లు పైబడ్డ వయసు. నేత చీర, శ్రద్ధ లేని జుట్టు, నిద్రలేని కళ్లు, విశ్రాంతి లేని చేతులు. మెడలో చెమటకి నానీనానీ చర్మపు రంగులో కలిసిపోయి ఉందోలేదో అన్నట్లనిపించే పసుపుతాడు.

ఆమె కళ్లు గతాన్నీ, భవిష్యత్తునీ కలిపి శూన్యంలోకి చూస్తున్నాయి. నిజానికి ఆ రెంటి పట్ల ఆమెకెప్పుడూ చింతలేదు. ఆమె ఒకరోజు ముందు జరిగిన అలజడినీ, కొద్దిరోజుల నుంచీ జరుగుతున్న సంఘటనలనీ బేరీజు వేసుకుంటూ ఉంది.

నిన్న ఉదయమనగా లోయులో కలకలం రేగింది. అప్పట్నించీ చెన్నమ్మనీ, ఆచారినీ కలిపి తిడు తూనే ఉంది జయమ్మ. అప్పటివరకు వాళ్లిద్దరు అక్క చెల్లెళ్లలా మెసిలేవారు. తనకూ ఆచారికీ అంటగట్టి పూనకం వచ్చినదానిలా జయమ్మ తిడుతూ ఉంటే హతాశురాలై చూస్తుండిపోయింది చెన్నమ్మ. అప్పటి నుంచీ ఆమె అక్కడ పచ్చి మంచినీళ్లు ముట్టలేదు.

జరిగిన గొడవేమిటో శీనుకు మొదట అర్థం కాలేదు. అర్థమయ్యాక నమ్మబుద్ధి కాలేదు. నిజమో కాదో తెలుసుకోవడానికి ఆచారిని కలుద్దామని కొండ గుడికి వెళ్లాడు. అప్పటికే అతడు అక్కడ నుంచి వెళ్లి పోయాడని తెలిసింది.

ఆచారి వెళ్లిపోయాడని శీను చెప్పగానే జయమ్మ కోపం కట్టలు తెంచుకుంది. ఒక్క ఉదుటున లేచి గుడిసెలోకి వెళ్లి చెన్నమ్మ బట్టలు తీసి బయటకు గిరాటేసింది. ఇక మొహం చూపించనక్కర్లేదంది. శీను అడ్డుపడబోతే,

"ఓ శీనయ్యా! నీకు తెలవదా, నేనూ ఈ యమ్మి లాగే ఇక్కడికి రాలేదా. అప్పుడు నాకు మగడుండాడా? పసిగుడ్డుతో నా బతుకు నేను బతకి చూపలేదా... నేనొం టిగా నిలబళ్లేదా... ఈ రంకుతనం నేను చేయలేకా..." అని చెన్నమ్మ బట్టలు బయటకు విసిరి కొట్టింది.

పంతం పడితే ఒదిలే రకంకాదు జయమ్మ. కిందటిరోజు ఉదయమనగా మొదలైన గొడవ మరు నటి రోజు సాయంత్రందాకా సాగుతూనే ఉంది. జయమ్మ కటువైన మాటలకు చెన్నమ్మ ఒక్కమాట కూడా మాట్లాడలేదు. బయటపడిన బట్టలన్నీ మూట కట్టుకుంది. రాత్రంతా గుడిసె ముందు పంచలోనే కన్నార్పకుండా కూర్చుంది. కొడుకు తిన్నాడో లేదో కూడా చూడలేదు.

చల్లారిపోయిన టీ గ్లాసు మీద ఈగలు ముసురు తున్నాయి. శీనుకు ఆచారి కళ్లముందు మెదిలి, 'పోయి నోడు పోకుండా ఈ యమ్మిమీద అపవాదు నిజం చేసి పోయాడు,' అనుకున్నాడు. అప్పటికీ అతడి మనసులో అదింకా అపవాదుగానే ఉంది. నిజమో కాదో అతడింత వరకూ ఆలోచించలేదు.

అక్కడి నిశ్శబ్దాన్ని భంగం చేస్తూ జయమ్మ, "ఇదిగో శీనయ్యా ఆచారి చేసుకున్న పుణ్యం పుట్టలో పోసుకున్నాడు. మొహం చూపడానికి సిగ్గుసెరం అడ్డొచ్చినట్టుంది- కొత్తాయన వొచ్చేదాక కొండ మీద నువ్వే దీపం ముట్టించి రా," అన్నది.

శీను ఏమీ మాట్లాడక వెళ్లడానికి లేచి నిల్చొని పైకి చూశాడు. అతడి చుట్టూ లోయ పైకప్పు కూలిన పురాతన కోటలా దిగులుగా ఉంది. చుట్టూ ఎత్తయిన కొండల ఏటవాలు మీద పొడవాటి చెట్లు గంభీరంగా నుంచుని ఉన్నాయి. కొండ శిఖరాల పగుళ్ల నుంచి బండరాళ్లు ఎప్పుడెప్పుడు జారి లోయలో పడతాయో అన్నట్లున్నాయి.

జయమ్మ తిట్లు సాగుతూనే ఉన్నాయి. విని విని చెన్నమ్మ సద్దిన మూట చంక నెత్తుకుంది. పిల్లోడు లేచి నిలుచున్నాడు. చెన్నమ్మ బయల్దేరడం చూసి జయమ్మ, "ఓ మణెమ్మా... ఆ యమ్మికొక వంద కాగితం తీసివ్వు. దగ్గిరుంచుకోమను. యాడికి పోతారో ఏమో," అంది.

మణెమ్మ మినపప్పు పక్కనపెట్టి చేతులు కొంగుకు తుడుచుకుని రేకుల డబ్బాలోంచి వంద నోటు తీసి చెన్నమ్మకివ్వబోయింది.

చెన్నమ్మ దానివంక చూడకుండా బయటికి నడుస్తూ, 'అక్కా వెళ్లొస్తా'నని చెప్పినా, అటు తిరిగి పడు కున్న జయమ్మ సరేనని కూడా చెప్పలేదు. తల్లిని అను సరిస్తూ బయటకు నడుస్తున్న పిల్లవాడు 'పెద్దమ్మా పోయొస్తా'ను అని అన్నా జయమ్మ కదిలినట్లు కదిలి మళ్లీ బిగదీసుకు పడుకుంది. చెన్నమ్మ కనుకొనల నుండి సన్నగా కారుతోన్న నీటిని పిడికిలితో తుడుచు కుంటూ, "పోయొస్తా శీనయ్యా," అంటూ తలొంచు కుని బయటికి నడిచింది.

శీను ఒక్కసారి భారంగా నిట్టూర్చి జయమ్మను చూసి, 'ఈమెదెంత కఠినమైన మనసు,' అనుకుని స్నానానికని జలపాతం వైపు బయల్దేరాడు. అడుగులు చిన్నగా ముందుకు పడుతుంటే జయమ్మ మాటలు మళ్లీ వెనక నుంచి వినిపించాయి.

"ఓ శీనయ్యా... సత్రం బాపనాయనకి చెప్పు. ముసిలోళ్లిద్దరికి పుణ్యానికొచ్చిన పచ్చి మామిడి కాయలు అరగలేదంట- రేత్రికి కూడు తినరంట. ఆళ్లిద్ద రికీ వండొద్దని చెప్పు..." ఆమె మాటలు దూరమవుతూ ఉన్నాయి. వెనక్కి తిరిగి వింటున్నట్లు చెన్నమ్మకేసి చూశాడు. చంకలో మూటతో కొడుకు చేయి పట్టుకుని చిన్నగా దారంట నడిచిపోతూ ఉంది ఆమె.

శీను జయమ్మ చేతి కింద మనిషి కాడు. అతడికి ఇవాళ ఇక్కడ ఉండాలన్న నియమంలేదు. రేపేమిటన్న చింత లేదు. ఎక్కడతోస్తే అక్కడికి వెళ్తాడు. కొన్నాళ్లు సిద్ధేశ్వరంలో ఉంటాడు. శివరాత్రికి శ్రీశైలం చేరుకుంటాడు. రోహిణికి భైరవకోనకొస్తాడు. ఎక్కడికెళ్లినా సాధువులతో స్నేహితం. సత్రంలో భోజనం, చెట్ల క్రింద నిద్ర- అదే జీవితం. ఎక్కడికి వెళ్లినా అక్కడి మనుషులతో కలిసిపోతాడు. నీది నాది అనకుండా పనిచేస్తాడు. వాళ్లు పెట్టింది తింటాడు. ఎంతోకాలం నుంచి అతడీ లోయకు వచ్చి వెళ్తుండటం చేత ఇక్కడి మనుషులందరూ అతడికి చిరపరిచితం. అందరి దగ్గర పనిచేసినట్లుగానే జయమ్మ కొట్లోనూ ఎంగిలి గ్లాసులు, ప్లేట్లు కడుగుతాడు. పొయ్యి మీద టీ పెడతాడు. వచ్చినవారికి కావలసినవి చూస్తాడు. ఇంతా చేసి అతడు అక్కడ తాగేది టీ మాత్రమే.

జయమ్మ కొట్టునుండి అర ఫర్లాంగు దూరం నడిస్తే కొండ శిఖరంపైనున్న రాళ్లపగుళ్ల నుండి నీళ్లు లోయలోకి దూకే జలపాతం. శీను అక్కడికి చేరుకునేసరికి ఒకరిద్దరు యాత్రికులు పై నుంచి పడుతున్న నీళ్ల క్రింద నుంచుని కేరింతలు కొడుతూ ఉన్నారు. ఆ లోయకు చుట్టూతా వందమైళ్ల దూరాన కరువు ప్రాంతం కాబట్టి అక్కడికి వచ్చే యాత్రికులు తక్కువ.

కండువా నడుముకి చుట్టుకుని జలపాతం కింద నుంచుంటే శీనుకు చల్లని నీళ్లు ఒంటికి  తగిలి వేళ్లు కొంకర్లుపోతూ ఉన్నాయి. అతడికి అక్కడ స్నానం చేయడమంటే చాలా ఇష్టం. రాళ్ల పగుళ్ల మధ్య నుంచి పారుతున్న నీరు పై నుంచి నెత్తిమీద పడి భుజాలను ఒంటిని తడుపుతూ పాదాల నుంచి కాలువలోకి పడుతూ ఉంటే మనిషి నిలువెల్లా పులకించిపోతాడు. కళ్లకడ్డంగా గంతలు కట్టిన నీటిధారలో తన సమస్త ప్రయాణాలని, బాధలని, దుఃఖాలని మరచి గంటల తరబడి పరవశిస్తూ ఉంటాడు. కాని ఆరోజెందుకో కొంకర్లుపోయే చలిలో కూడా నిశ్చలమైన యోగిలా నీటిధార కింద నుంచున్నాడు. పై నుంచి పడుతున్న నీరు అతడికివాళ పరవశాన్ని కలిగించడం లేదు. పై నుంచి పడుతున్న చల్లటి నీరు శరీరాన్ని చుట్టుముడుతున్నా అతడు తపస్సు చలించని ముని వలె కూర్చుని, 'ఎంత కఠినమైన మనసు,' అని జయమ్మని తలుచుకొని తనలోతాను గొణుక్కున్నాడు. ఆ లోయలో అతడికి అంతకు ముందున్నంత ప్రశాంతత లేదు.

నెత్తి మీది నుంచి పాదాల దాకా ఒళ్లు తడుపుకుని గట్టుమీద వచ్చి నుంచుంటే శరీరం ఒణుకుతూ ఉంది. పొద్దుగూకే కొద్దీ యాత్రికుల స్నానఘట్టం ఖాళీ అవుతూ ఉంది. స్నానాలు కానిచ్చిన వాళ్లు గుడిమెట్ల వైపు పోతూ ఉన్నారు. ఒళ్లు తుడుచుకుని వీబూతి నామాలు పెట్టుకుని కొండగుడి వైపు నడుస్తుంటే అతడిని అల్లంత దూరం నుంచి చూసి అడివి కోళ్లు గబగబ చెట్లల్లో దూరుతూ ఉన్నాయి. ఆలోచిస్తూనే శీను కొండ దిగి సత్రం చేరుకునేసరికి సత్రపాయన లోపల తీరికగా కూర్చుని, "ఏంది శీనయ్యా ఈయాలప్పుడొచ్చినావు," అన్నాడు.

"దీపం ముట్టించడానికి పోతన్నాగానే... ముసిలోళ్లిద్దరికి వంట చేయొద్దని జయమ్మ చెప్పింది- అది చెప్పిపోదామనే ఇటొచ్చా," అన్నాడు శీను.

"సరె... సరె... ఇప్పుడె ముసిల్దొచ్చి చెప్పి పోయిందిలే... ఆచారి పత్తాలేడు- నువ్వు పోయిరా," అన్నాడు సత్రపాయన.

లోయలోకి ప్రవేశించే ముందు అర కిలోమీటరు దూరంలో పెద్ద రాతి కొండ వస్తుంది. దానిని కొండగుడి అంటారు. ఒకే రాతి కొండలో తొలిచిన గుడి కాబట్టి దానికా పేరొచ్చి ఉండవచ్చు. ఒకటే శిలలో లోపలికి తొలిచిన మూడు నాలుగు చీకటి గదులు. వాటిలో నేలలోకి దించిన నల్లటి లింగాలు. జలపాతం నుంచి కొండగుడిని చేరుకోవాలంటే ముందు రాళ్లగుట్టలతో ఉన్న కొండ ఎక్కవలసి వుంటుంది. ధర్మసత్రం ఆ కొండవాలు మీదనే ఉంది. దాని పక్కనే జలపాతం నుంచి వచ్చే నీళ్లు లబలబమని బయటికి పోయే కాలువ.

కొండరాళ్ల మధ్య నుంచి మెట్లెక్కుతూ కొండగుడికి చేరుకున్నాడు. కొండని తొలిచిన గదుల గోడలపై కర్పూరం కలిసిన దీపపు కవురునూనె లేమి. మరువంతో కలిపి గుచ్చిన మల్లెపూలు, పచ్చికొబ్బరి, సాంబ్రాణి వాసన. స్నానంచేసి వచ్చిన భక్తులు నంది ముందు కొబ్బరికాయలు కొట్టి మొక్కుతున్నారు. పక్క పక్కనే ఉన్న ఆ మూడు గుళ్లలోనూ భక్తులెవరైనా దీపం ఆరిపోకుండా  నూనె పోసి ఒత్తి వెలిగిస్తూనే ఉంటారు. కాని అక్కడికి కొద్ది దూరాన బండ కింద సొరంగంలోకి వెళ్లి దీపం ముట్టించి రావాలంటే ఎవరికైనా భయమే. మనిషి దూరేంత కంత- పెద్ద కొండరాయి కింద ఉండటంతో ఎవరికీ కానరాక చాటుగా ఉంటుంది. సొరంగానికిరువైపులా నెత్తిన పొట్టేలు కొమ్ములతో చేతిలో గదతో పరమ శివుడికి కాపలా కాస్తున్న వీరభద్రుడి చెక్కిన బొమ్మలు. ప్రతి రోజూ అక్కడ దీపారాధన చేసేది ఆచారే. గత కొద్ది సంవత్సరాలుగా

అతడికి అదే పని. అతడు తప్ప ఇంకెవరూ అందులోకి పోలేరు. గత రాత్రి ఎవరికీ చెప్పా పెట్టకుండా అతనెటో వెళ్లిపోయాడు. అతడికీ చెన్నమ్మకీ రంకుతనం ఉందని పుకారు లేచింది. అది ఆచారి చెవిన పడింది. అక్కడి మనుషులు తన గురించి అలా అనుకుంటున్నారని తెలియడంతో అతడా లోయ విడిచిపెట్టాడు. వెళ్లే ముందు ఎవరికీ చెప్పలేదు. అతడు మళ్లీ వస్తాడని ఎదురుచూసేవాళ్లు ఎవరూ లేరు.

శీను సొరంగానికి అడ్డంగా పెట్టిన చెక్కల తడికను పక్కకు నెట్టి మోకాళ్ల మీద వంగి లోపలికి చూశాడు. అంతా కటిక చీకటి. అక్కడ నుంచి కొద్దిగా ముందుకు పాక్కుంటూ కాస్త వెడల్పుగా తొలచిన మనిషి కూర్చోగలిగేంత గదిని చేరుకున్నాడు. నేలలోకి దించిన శివలింగం ముందు క్రితంరోజు సాయంత్రం ఆచారి వెలిగించిపోయిన దీపం మిణుక్కుమంటూ ఆరిపోయే దశలో ఉంది. ఆరిపోయే ఒత్తిని రాజేసి నూనె పోస్తూ ఉంటే ఆచారి కళ్లలో మెదిలాడు. అక్కడే తొలి సారి ఆచారిని చూశాడు అతడు. నల్లటి చెట్టంత మడిసి. పక్కటెమికల దాకా పెరిగిన పొడవాటి జుట్టు. గుండెల దాకా వేలాడే నల్లటి దారపు పీచు గెడ్డం. బక్క పలచటి మనిషికి ఎప్పుడూ అచ్ఛాదన లేని విశాలమైన వక్షం. ఆచారి చదువుకున్న మనిషి కాడు. విని నేర్చుకున్న పురాణ కాలక్షేపమే. పంచె పైకి మడిచి దక్షుడి తల నరికిన వీరభద్రుడి దక్షయజ్ఞం కథ చెప్తుంటే ఒళ్లు గగుర్పొడిచేది. చెవులొగ్గబట్టి వినేవాడు. చుట్టు పక్కల ఊళ్లలో పేరున్న పూజారి. భవబంధాలు లేని మనిషి.

'అసుమంటోడు ఏమైపోయాడు. ఆ మనిషికి ఆడమనిషి కావాల్సొచ్చింది. చేసుకున్న పుణ్యం ఏమై పోను. భవబంధాలు లేని మనిషికి ఈతిబాధలు ఎరుక లేవా. ఎవురికీ చెప్పకుండా దేనికోసం వెతుక్కుంటూ పోయాడు. రాయిలాంటి మనిషి ఆడమనిషికి కరిగి పోయాడు. ఒంటి కాలిమీద తపస్సు చేసే ముని కాలు జారి లోయలోకి జారిపడినట్లు ఎల్లిపోయాడు.'

మొదటిసారి అతడక్కడికొచ్చినప్పుడు ఆచారే అతనికి సొరంగం గురించి చెప్పాడు. ఆరోజు ఆచారి లోపల కూర్చుని, "దీని పొడవు పామూరుదాకా ఉంది సావి. మొత్తం ముప్ఫైమైళ్లు. అదుగో, ఆయన ఉండాడు సూడు సుబ్బయ్య సావంటారు. ఆయనొక్కడే ఇందు లోంచి అక్కడదాకా పోయాడు. అందుకే బయట ఆయన బొమ్మ చెక్కి పెట్టారు..." అన్నాడు.

ఇప్పుడు సొరంగం బయట సుబ్బయ్యస్వామే మిగిలాడు. లోపల ఆచారి లేడు. అంతకుమించి ఆచారెవరో అతని గత జీవితమేంటో తెలియదు. తెలుసుకోవాల్సిన అవసరం రాలేదు.

రాతి ప్రదేశం కావడంతో ఒళ్లంతా చెమటలు కారుతూ ఉన్నాయి. అక్కడనుంచి రెండు మెట్ల పైన సన్నటిదీపం వెలుగులో మిణుక్కుమంటున్న ఇంకో గది. అక్కడనుంచే సొరంగం మొదలవుతుంది. శీను మోకాళ్ల మీద కూర్చునే చిమ్మచీకటిలో రెండో గదివైపు పాకబోయాడు. ముందుకు జరగబోతున్నప్పుడల్లా పురుగులు రివ్వుమని మొహాన కొడుతూ ఉన్నాయి. పురుగులు కావవి, అడవి సీతాకోక చిలుకలు అను కున్నాడు. అగ్గిపుల్ల ముట్టించి లోపలికి దూరాడు. భరించలేని వాసన. లోపల కొడిగడుతున్న దీపం ముందు ఒత్తి రాజేసి సందేహిస్తూనే సొరంగం వెళ్లే దారి చూశాడు. అతడికది చీకటిమడుగులా తోచింది.

"ఎవురూ రాలేని చోటికి ఆచారి ఎలా వచ్చేవాడు. చెన్నమ్మ... ఆచారి... అది నిజమేనా... నిజమో కాదో ఎవరికి తెలుసు. అది ఎప్పటికీ తెలియని రహస్యం. ఎవురు చూశారు. నిజమే అయ్యుండాల. నిజం కాక పోతే ఆచారెందుకు పోయాడు. తప్పు చేసినోడు కనుకనే వెళ్లిపోయాడు. ఎల్లినోడు ఒంటరిగా ఎట్టెల్లాడు... యాడికి పోయుంటాడు. సిద్ధేశ్వరంలో ఉంటాడా... మహానంది పోయుండాల... మళ్లీ యాడ కలుస్తాడు... చేతి పక్కన చీకట్లో ఏదో కదిలిన చప్పుడైంది. నిర్జనం గున్న చోటులో అదేమై ఉంటుంది... చుట్టుకునున్న పావేమో..."

ఆ ఆలోచన రాగానే భయంతో మోకాళ్ల మీద కూర్చునే వెనక్కు తిరిగి పైకి చూశాడు. పురుగులు కావవి మసకచీకట్లో కప్పుకు వేలాడుతూ వీపుకు తగులుతున్న గబ్బిళాలు. అది... గబ్బిళాల గుండం. గబగబ పాక్కుంటూ బయటకు వచ్చాడు. ఒళ్లంతా చెమటతో తడిసిపోయి ఉంది. ఒంటికీ పంచెకీ బొగ్గు రాసినట్లు నల్లటి మరకలు. ఆచారి అలవాటున్న మనిషి. శీనుకదే తొలిసారి.

గుహలోంచి బయటకు రాగానే ఒంటికి చల్లటి గాలి తగిలి ప్రాణం లేచి వచ్చింది శీనుకు. వెనక్కు తిరిగి లోపలికి చూస్తే లోపల వెలుగుతున్న రెండు దీపాలు రాక్షసుడి రెండు కళ్లలా కనిపించాయి. లోయ మధ్య చీకటలుముకోవడంతో చెట్ల మధ్య గిలకోళ్లు గుయ్యి మని గోలచేస్తూ ఉన్నాయి. నీలాకాశం నుంచి నక్షత్రాలు చించుకొస్తున్నాయి. చీకటి పడుతున్నా చెకుముకి పిట్ట డుముక్కుడుముక్కుమంటూ ఉంది. ఎత్తుగా ఉన్న

మామిడిమాను మీద రెండు కోతులు పేలు చూసు కుంటున్నాయి.

కొండగుడి ముందు భక్తులు పూజలు కానిచ్చి మెట్ల మీద కూర్చున్నారు. శీనుకు తను వెళ్లిన పని పూర్త యింది. ఇక ఎక్కడికో వెళ్లాలనేమి లేదు. అతడి కోసం ఎదురుచూసే వారెవరూలేరు. ఎటైనాపోవచ్చు. ఎక్క డైనా పడుకోవచ్చు. అతడికి తనదైన గూడంటూ లేదు. కాకుంటే సత్రపాయన, 'ఇయాల శీనయ్యాడికి బోయాడు, కింద జయమ్మ కొట్లో పడుకున్నాడేమో,' అనుకుంటే- 'శీను సత్రంలో వున్నాడ'ని జయమ్మను కుంటుంది. సత్రం మెట్లమీద యాత్రికులు వంటా యన గంట కోసం చూస్తూ కూర్చున్నారు. లోపల సత్ర పాయన కళ్లజోడు పెట్టుకుని లెక్కలు చూస్తూ ఉన్నాడు.

శీనుకి ఆకలనిపించలేదు. సత్రపాయన కంట పడకుండా కాస్త ముందుకి అడుగులేశాడు. గూని ముసలమ్మ మండపంలో పక్కలేసుకుని కూర్చునుంటే ముసలాయన నడుం వాల్చి ఉన్నాడు. ఎక్కడో పుణ్య క్షేత్రంలో గుళ్లు చేయించుకుని నుదుట ఇంతేసి కుంకుమబొట్టు పెట్టుకున్నారు. అతడు ముసిల్దాన్నే మాట్లాడించగలడు. ముసలాయనకి పుట్టచెవుడు. శీను ఆమె దగ్గిరకెళ్లి నుంచునే, "ఏందమ్మమ్మా అన్నమరగ లేదా," అనడిగాడు. ముసలామె మసకచీకట్లో కళ్లకి చేతులడ్డం పెట్టుకుని, "ఏంది శీనయ్యా నువ్వా... రెండు కాయలు కొట్టిమ్మనడిగితే చెన్నమ్మ కొడుకు తెంపిచ్చినాడు. నోరంతా పులుపు..." ముసిల్ది చెప్పుకు పోతూ ఉంది.

వాళ్లిక్కడకొచ్చి మూడు దినాలయింది. రేపో మాపో రాలిపోయే ఆకులు. వచ్చినరోజు, "ఏంద మ్మమ్మా ఇంత ఎండలో రాకుంటే ఏంబోయింది," అనడిగాడు శీను.

"ఏం చెప్పమంటావు మనవడా, మా ముసలా యనకి దేశాలు చుట్టి రావాలని బుద్ధి పుట్టింది. అలివి గాని పలవ, యాడా నిలవజాలని గుణం. కొడుకులు కూతుళ్లే కాదు, ఎవరి మాటా ఇనడు. మొండినాబట్ట- నా పాణానికొస్తంది. యాభై ఏళ్లుగా బరిస్తా ఉండాను. ఏం చెప్పమంటావు నాయనా నా బాధ," అన్నది. తన గురించే కాబోలని ముసిలాయన బోసినోటితో ముసి ముసి నవ్వులు నవ్వుతూ ఉన్నాడు. వాళ్లిద్దరు మూడు దినాల నుంచి సత్రంలోనే పడుకుంటున్నారు.

ముసలామె గొణుగుతూనే నేల మీద మేను వాల్చింది. శీను ఆమె గురించి ఆలోచిస్తూ ముందుకు నడిచాడు.

'యాభై ఏళ్ల కాపరం. మగడ్ని ఇంకా బరిస్తా ఉంది. నేను రాను నీ దారి నూ పో అనొచ్చుగా. ఎందు కనదు. విడవలేని గుణం. ఎలా విడిచి ఉండగలదు... అనుబంధం అసుమంటిది... ఇప్పటిదాకా వచ్చిన తోడు ఈ క్షణానికే పోతుందా...' చూడగా చూడగా శీనుకి ఆమె యాభైయేళ్ల జీవితం పెద్ద లోయలా అనిపించింది. ఆ లోయలో అతనికింకేమేమో కనిపించాయి. యుక్త వయసులో ఉన్న యువతీ యువకులు... పెళ్లి... పిల్లలు... సంసారం... పిల్లల పెళ్లిళ్లు... మనవలు... మనవరాళ్లు... ప్రయాణాలు... ఆలోచించేకొద్దీ ఆ ముసలామె ఎవరూ చేరుకోనంత ఎత్తున ఉన్నట్లని పించింది.

'ఆలుమగలంటే అలాగుండాలి. చెన్నమ్మా- నీకూ పెనిమిటి లేడా... నీవూ ముసల్దానిలా ఎందుకు లేవు... నీవు చేసిన తప్పేమిటి?' అనుకొన్నాడు శీను.

అతడు కొండ ఎక్కుతూ ఉంటే కాళ్లకు చిన్నచిన్న రాళ్లు తగిలి కిందకు దొర్లిపోతూ ఉన్నాయి. పైకి వెళ్లేకొద్దీ మనుషులు కంటికి చిన్నగా కనిపిస్తున్నారు. అక్కడక్కడా వెలుగుతున్న దీపాలు. మామిడిమాను కింద జయమ్మ కొట్టు కట్టేసి ఉంది. గుడిసె లోపల మిణుక్కుమం టున్న దీపం. అతడికి జయమ్మ గతం కళ్ల ముందు కదిలింది.

జయమ్మని పదేళ్ల నుంచీ చూస్తున్నాడు. పది హేనేళ్ల క్రితం భర్తని పోగొట్టుకుని మూడు నెలల పిల్ల వాడితో అక్కడ అడుగుపెట్టింది. అప్పటి నుండి అక్కడే జీవనం. ఆ చెట్టు కిందనే చిన్న కొట్టు పెట్టుకుంది. మాట కఠినమైనా మనసు మంచిది. అక్కడికి వచ్చే భక్తు లకు, యాత్రికులకు రెండు రూపాయల టీ అమ్మినా దిక్కూ మొక్కూలేని బైరాగులకి, సాధువులకి అర్ధ రూపాయికే టీ పోస్తుంది. డబ్బుకి ఆశపడే గుణం కాదు. ఆ యమ్మి దానం చెయ్యని పూటలేదు. నియతితో జీవితం నడుపుకొచ్చింది. పుణ్యాత్మురాలు. ఆ యమ్మిలా బతకాలంటే ఎంత కష్టం ఓర్చుకోవాల. మంచిగ బతకాలంటే మహాకష్టం. చెడ్డగ బతికేందుకు సవాలక్ష దారులు...

ఆలోచిస్తూనే ఎంతసేపు నడిచాడో తెలియదు. కొండ శిఖరం మీద పెద్ద రాయి మీద నుంచుంటే ఎదురుగా లోయ కనిపించనంత లోతుగా ఉంది. 'ఈ లోయ కంటే జయమ్మ బతుకు లోతుగా వుంది- ఆమె జీవితమంతా ఓర్చుకున్న చీకటే,' శీను తనలో తను గొణుక్కుంటుంటే కాలికి చిన్నరాయి తగిలి ధనధన

లోయలోకి పడింది. ముందుకు వంగినట్లు వంగి తమా యించుకుని వెనక్కు జరిగి నిలబడ్డాడు. ఎదురుగా అడుగు కనిపించని లోతైన అగాథం.

'ఎక్కడ జయమ్మ, ఎక్కడ చెన్నమ్మ. వాళ్లిద్దరి మధ్యన ఎంత తేడా. ఆ యమ్మి పర్వత శిఖరం మీదుంటే ఈ యమ్మి పాతాళంలో ఉంది... చెన్నమ్మ కూడా జయమ్మలా ఉండకూడదా... ఎక్కడుంది లోపం... ఆమె చేసిన తప్పేమిటి?' చెన్నమ్మ జయమ్మలా లేనందుకు అతడికి బాధ కలిగింది. అతడి అశాంతికి కారణం కూడా అదే. లోయ మీద గూళ్లకు చేరే పక్షుల గుంపును చూసి అతడికి మరింత దిగులు కలిగింది. అతడి మనసంతా గూడులేని పక్షిలా అశాంతిగా గతం నుంచి వర్తమానానికి, వర్తమానం నుంచి గతానికి తిరగసాగింది.

"ఆ మాటకొస్తే జయమ్మ మాదిరే పది నెలల క్రితం పదేళ్ల పిల్లవాడితో వచ్చింది చెన్నమ్మ. పక్కన మొగుడు లేడు. మొహాన బొట్టు మాత్రం ఉంది. మొదట రెండు రోజులు సత్రంలో పడుకుంది. ఆ రెండురోజులూ ఒళ్లెరగకుండా పనిచేసింది. ఆ తరువాత ఆమెకు జయమ్మ పరిచయం అయింది. వచ్చినరోజే, 'నీ మగడేడే పిల్లా,' అని జయమ్మనడిగితే, 'ఏం చెప్ప మంటావక్కా... ఒక పనికి పోడు, ఓచోట కూర్చోడు. తాను చెయ్యడు, నన్ను చేయనీయడు. అట్టాంటోడితో బతికేదేంటిదని కొడుకునేసుకుని దేశాలు పట్టి పోతన్నా... నీకూ భారం కానులే,' అన్నది చెన్నమ్మ.

"భారమేంది చెల్లా ఈ అడివిలో మూగజీవాలెన్నో ఉండాయి. వాటితోపాటే మేమూ. అలానే నువ్వూనూ," అన్నది జయమ్మ. ఎంత మంచి మనసు. ఎవురుంటారియాల. మనసెంత మెత్తనో మాటంత కటీనం. ఎవరేమన్నా తూలిపోయే గుణం కాదు గుండె నిబ్బరంగల మనిషి. కోపమొస్తే ఆమె నోటికి లోయలో రాళ్లు కూడా దడుస్తాయి.

చెన్నమ్మకి వచ్చినన్ని రోజులు పనీపాటాతోనే గడిచిపోయింది. హోటలు కాడ పిండి రుబ్బే పని దగ్గర నుంచి సత్రంలో బియ్యం ఏరే పని వరకూ తనే చేసేది చెన్నమ్మ. ఆ యమ్మి గారెలు చేస్తే ఎంత కమ్మగా వుంటాయి. నాది నీది అనకుండా అక్కడా ఆ పననీ ఈ పననీ చేసింది. ఎప్పుడూ వంచిన నడుం ఎత్తుదు. చేతిలో పనేగాని నోటమాట లేదు. జయమ్మ నడిగితే ముంగిముండలు అలానే వుంటాయంటుంది గామాలు. మరెందుకో ఆ యమ్మి ఎక్కడెంత గొడ్డు చాకిరీ చేసినా ఎవరి దగ్గిర చేయి చాపలేదు. ప్రాణానికి బుక్కెడు బువ్వ తప్పితే మరేదీ ఆశించలేదు.

అక్కడేకాక లోయలోకి వచ్చే కాలిబాట పక్కన కొండగుడిని ప్రతిరోజూ శుభ్రం చేసే పని కూడా చెన్నమ్మే చేసేది. ఆచారి ఆమెకి అక్కడే పరిచయ మయ్యాడు. గుడిని చిమ్మేటప్పుడు కడిగేటప్పుడు ఆచారి దగ్గిరుండి పని చేయించుకునేవాడు. పనులు పూర్తయ్యాక భోజనాలు చేసి అందరూ పడుకున్నాక రాత్రి నడిజాము దాకా వాళ్ల పురాణ కాలక్షేపం సాగేది. చెట్టు కింద దీప స్థంభం కింద కూర్చుని శ్రీ కాళహస్తీశ్వర శతకం, మార్కండేయ పురాణం, దక్షయజ్ఞం చెప్పేవాడు. అప్పుడప్పుడూ తను కూడా వెళ్లి వినేవాడు.

ఆచారి అడివికెళ్లి కట్టెలు కొట్టి తెచ్చేవాడు. చెన్నమ్మ సత్రం, గుడి ముందు ఊడ్చి ముగ్గేసేది. ఆచారి సత్రానికి కావాల్సిన బియ్యం పప్పు కొనడానికి కొత్తపల్లి వెళ్తే ఆ యమ్మి డబ్బిచ్చి తనకు కావలసిన సామానులు అతడి చేత తెప్పించుకునేది. తెలీనోళ్లు చూస్తే ఆలుమగలనుకోవాల్సిందే. వాళ్ల సావాసం చూసి మనిషికి మనిషే తోడనుకున్నాడు తను. కడకు తెలవకుండానే చేసిన స్నేహం లోకుల చూపుకి పాపంగా కనిపించింది. కొందరు ఆళ్లిద్దరినీ జలపాతం కాడ చూశామంటే కొందరు అడవిలో కబుర్లాడుకుంటుంటే చూశామన్నారు. ఆళ్లు చూసేది ప్రతిదినం జరిగేదే. అందరి ముందు మాట్లాడుకుంటే తప్పు కానిది అడివిలో కెళ్లి మాట్లాడుకుంటే తప్పైంది. ఆళ్లు చూసింది తాను చూడ లేదా!

ఒకరోజు శీను చెట్టుకింద పడుకునుంటే వేకువ ఝామున కొండపై నుంచి రాళ్లు దొర్లి పడుతున్న చప్పుడైంది. కణుజుల గుంపనుకుని ఉరుక్కుంటూ పైకెక్కితే కిందికి దిగొస్తున్నాడు ఆచారి.

పై నుండి చూస్తే కింద చెన్నమ్మ జలపాతం కింద స్నానం చేస్తా ఉంది. కింది నుంచి చూస్తే పై మనిషి కనపడ్డు. తనకప్పుడు అనుమానం రాలేదు. ఆళ్లిద్దరంటే చెడాలోచన లేదు. ఆళ్ల రంకుతనం నిజమేనా? నిజమో కాదో ఎవురికి తెలుసు. నిజమే అయ్యుండాల. కళ్లతో చూడనిది నిజమెట్టా అవుద్ది. కాకుంటే మరి ఆచారెందుకు పోయాడు. ఒకేళ నిజమే అవుతే... కోనలో పూజలు చేసుకుని బతికే పూజారికి ప్రేమ పుట్టిందను కోవాల. పుడితే తప్పేంటి. ఆ యమ్మికి ఎవురూ లేరు. ఆచారి ఎవురికీ కాడు.

అందరిలాగా బతకమంటుంది లోకం. మొగుడుంటే గూని ముసల్దానిలా బరిస్తా బతకాలి. లేదా జయమ్మలా ఒంటరిగా బతుకీడవాలి. అది తప్ప దారి లేదా... ఒకపక్క గూని ముసలమ్మ... మరొకపక్క

జయమ్మ... ఒకరిది సుదీర్ఘమైన సంసారం... మరొకరిది ఒంటిమాను లాంటి ఒంటరితనం... మరి చెన్నమ్మ? అదే నిజమయితే ఆమెని విడిచి ఎందుకు పోయాడు... తప్పు కాదా...?

అతడు కొండరాయి పైకెక్కి కిందకు చూశాడు. లోయలో గుబురు చెట్ల మధ్య సన్నని దారమ్మట చంకన మూటతో చెన్నమ్మ నిదానంగా నడుస్తూ ఉంది. చేతిలో పుల్లతో పక్కనే నడుస్తున్న పిల్లోడు.

'అంతా కలిసి ఆ యమ్మిని ఒంటరిని చేసి బయటికి నెట్టేశారు... అక్కడ నుండి కొత్తపల్లికి ఆరు మైళ్లు నడవాలి. చీకట్లో ఒక్కతే వెళ్లగలదా.'

"చెన్నమ్మా..." అని చేయెత్తి పిలిచాడు శీను- ఆమెకి వినపడే అవకాశం లేదు.

అతడిని ఎవరో చేతులు పట్టుకుని వెనక్కి లాగు తున్నట్లు తోచింది. విదిలించుకుని మరింత దూరంగా కిందికి పరిగెట్టాడు. మనసుకు దగ్గిరగా ఉన్న మనుషులు దూరం జరుగుతున్నట్లు దూరంగా ఉన్న మనుషులు దగ్గరకొస్తున్నట్లు... కళ్లు తిరిగి అంతా మాయలా అతడికనిపించింది.

జలపాతం కింద నుంచున్నట్లు కళ్ల చుట్టూ నీటి ధారలు... లోయలోకి జారిపోతున్నాడు తను... ఒక్క సారిగా చీకట్లోకి దూకినట్లు... ముందుకురికాడు శీను... చీకటి నుంచి శూన్యంలోకి జారిపోతున్నట్లు... కళ్లలో మెదులుతున్న ఆచారి.

నీళ్ల మధ్య తడిసి... పొడవాటి వెంట్రుకలను తలపై ముడేసుకుని... అదే రూపం... తడిసిన సన్నటి గెడ్డం... అనాచ్ఛాదితమైన దేహం... అతడూ ఈ అగాథం లోకి వెళ్లిపోయాడా... భవబంధాలకు కరిగిపోయాడా... కాదు... అస్పష్టమైన రూపం... అన్నిటికన్నా మించి మనిషికి మనిషే తోడని నమ్మిన మనిషి... అంతకు మించి మరింకేమీ లేదు... క్రమంగా అర్థమవుతున్న రూపం...

"చెన్నమ్మా..." అని మరొకసారి గట్టిగా పిలిచాడు శీను. అవతలి నుంచి సమాధానం లేదు.

కొండ మధ్య తొలిచిన ఎత్తయిన కాలిబాటని తప్పుకుని మసక వెలుతురులో గుబురుచెట్లని తోసు కుంటూ, పరిగెడుతూ ఆమెని ఆగమని కేక వేశాడు. రాళ్ల మీద దబదబ దిగుతున్న చప్పుడికి చెట్లమీద పికిలి పిట్టలు గాలిలోకి లేచి గిరికీలు కొడుతున్నాయి. ఆయువుపట్టులో విల్లు దెబ్బ తిన్న వన్యప్రాణి కొండ మీద నుంచి దొర్లిపడుతూ ఉన్నట్టు అతడు కొండరాళ్ల నుండి పొర్లుకుంటూ పరిగెడతా వస్తుంటే చెట్లముళ్లు ఒంటికి గీరుకుపోతూ ఉన్నాయి. రాళ్లు దొర్లిపడుతున్న శబ్దానికి చెట్ల మీద కోతులు పక్కన చెట్ల మీదికి ఉరికాయి.

చెట్ల మధ్య నుంచి చిన్నగా నడిచిపోతున్న చెన్నమ్మకు కొండపై నుంచి ఎవరో తనను పిలుస్తు న్నట్లు కేక వినపడి దడదడలాడే గుండెలతో అక్కడే నుంచుండి పోయింది. ఆమె కంటికి పిలుపు తప్ప మనిషి కనపడలేదు. ఒక్క క్షణం తరవాత కొండపై నుంచి చెట్టుకొమ్మ విరిగి లోయలో పడ్డట్టు శీను ఆమె ముందు విరుచుకుపడ్డాడు.

ఆమె ముందు పడీపడగానే శీను పైకి లేచి, "యాడికి పోతుండావు చెన్నమ్మా," అన్నాడు ఆయాసం తీర్చుకుంటూ. అతడి ఒళ్లంతా దుమ్ము కొట్టుకుపో యింది. శరీరమంతా చెట్ల కొమ్మలు గీరుకున్న నెత్తుటి చారలు.

చెన్నమ్మ అతడి వంక ఆశ్చర్యంగా చూసి, "యాడికేంది శీనయ్యా నువ్వు బతకటంలా... నేనూ అలానే," అని నవ్వింది. ఆ నవ్వులో బాధలేదు.

శీను ఆమె చేతిలో సంచి తీసుకుని, "నేనూ వస్తండా చెన్నమ్మా... నీకేదన్నా ఆసరా దొరికాక నా దారి నే పోతా," అన్నాడు.

చెన్నమ్మ ఆశ్చర్యంగా శీనుకేసి చూసి మళ్లీ నడక మొదలెట్టింది.

ముగ్గురూ లోయలో నుంచి బయటకు నడవ సాగారు.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 29 జులై 2007*